

# గుణాంతరం

## – నవులూరి వెంకటేశ్వరరావు

### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల

### (గత సంచిక తరువాయి)

"**నాకు ఫోను చేయడమనే** మంచి పని చేశావు. దొంగతనాలూ వగైరాల ప్రస్తావనా నా ముందుకు తేవడం సరైన చర్యగా నేను భావిస్తున్నాను. మోహిని గారు అయోగ్యుడిని నా దగ్గరకు పంపరని నాకు గట్టి నమ్మకం. నీవు ఆమె తాలూకూ కావడమే నీ యోగ్యతా పత్రం. నీ నిజాయతీ గురించి నువ్వు నా దగ్గిర నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. నిన్ను అనుమానిస్తే మోహిని గారిని అనుమానించినట్టే."

"నన్ను ఉద్యోగంలోకి తిరిగి తీసుకోమని మిమ్మల్ని అభ్యర్థించడానికి కాదు మీకు ఫోను చేయడమనే సాహసం చేసింది."

"అది నీవు చెప్పక్కర్లేదు. నా తెలివితేటల మీద కాస్త గౌరవం ఉంచు, అనంతం."

"క్షమించండి."

"తప్పు చెయ్యనివాడిని క్షమించడం ఎందుకయ్యా? వారం రోజులయ్యింది ఇద్దరమూ బొంబాయి వచ్చి. మాకు ఇక్కడ వెయ్యి మంది బంధువులున్నారు. హాయిగా ఉంది. ఇపుడు నాకు మీ ఊరిలోని వ్యాపారం కేవలం లెక్కకూ, కాలక్షేపానికి. మా పిల్లలకు అక్కడ వ్యాపారం మూసెయ్యాలని ఉంది. 'శరభను చూసుకోనీలే; మనకు నష్టం చేసే సాహసం చేయడు, లాభాలు గూబలదిరేలా ఇవ్వక పోవచ్చు గాని; గుడిలో లింగాన్ని మింగుతుంటాడు కానీ గుడిని మింగేయడు; అది మింగితే మొదటికే మోసం వస్తుందని ఎరుగని మూర్ఖుడు కాదు' – అని వాళ్లకు నచ్చ చెప్పాను. వాళ్ళు విన్నారు. వ్యాపారంలో దొంగతనమంతర్భాగం. ఎలుకలను కూడా అరికట్టటంకష్టమైనపుడు మేము అక్కడ లేకుండా మానవరూపంలోని ఎలుకలను వాటిని తరిమేయ్యలేం. కదా?"

"నా బాధ్యత నేను నిర్వర్తించడం గురించి మాత్రమే మీకు ఆ విషయాలు చెప్పానండీ. వాళ్ళిద్దరికీ ఉరిశిక్ష వేయడం గురించీ కాదు. ఇక నా పనయిపోయింది."

"నీ ఉద్దేశం అర్థమయింది, అనంతం. నాది పండుతల. నిజజీవితం రాజీలమయం. ఈ వయసులో, నా ఈ పరిస్థితులలో, నాలో వేడి రక్తం చల్లారిన ఈ వయసులో దేని గురించి పోరాడగలను, కోపం తెచ్చుకోగల్ను?"

"ఇక ఉంటానండీ!"

"నీవు నిరుత్సాహ పడకు. మా దగ్గరి ఉద్యోగం ఏమి ఉద్యోగమయ్యా? పెద్ద ఉద్యోగానికి అన్ని అర్హతలున్నాయి నీకు. పైగా మన్మథుడివి. మోహిని గారిని కలవడం జరిగితే అన్ని విషయాలూ నా తరఫున వివరించి, నన్ను క్షమించమన్నానని మనవి చేయి. ఆఖరుగా ఒక మాట. నాకు తెలిసిన ఒక వ్యక్తి ఉన్నాడు; అతను వ్యాపారం పెట్టుకోడానికి సాయం చేశాను. అతనికి ఇప్పుడే ఫోన్ చేస్తా. అతనిపేరు వేదాంత రావు...అద్దీ అతని చిరునామా గాజువాకలో; వెళ్లి ఇప్పుడే కలువు. సత్యమేవ జయతే న అనృతం."

## 3. సుఖోపాసన

ముచ్చటగానో అలా కాకుండానో మూడో ఉద్యోగంలోకి అడుగిడాడు. ఇది కూడా అవమానకరంగా ముగిస్తే ఏమి చెయ్యాలి అన్న ఆలోచన అతన్ని వేధించింది. బాధ, అవమానం, జీవిత నైతిక విలువలు అని నేను నమ్మే వాటిని, అంతరాత్మను తొక్కిపెట్టి – ఆ పని కలిగించే బాధను పళ్లతో కింది పెదవిని రక్తం వచ్చేలా కొరుక్కుంటూ దారిమళ్లించి జీవించడానికి ప్రయత్నం చేయగలిగితే ఈ ఉద్యోగం ఉంటుంది కొంతకాలంపాటు.

ఇక్కడ ఆరుగురు మనుషులు పని చేస్తారు. చిల్లరమల్లర పనులకు అప్పలస్వామి ఉన్నాడు. ఆరోజున ఇద్దరు రాలేదు. ఒకడు కార్ఖానాకు వెళ్ళాడు. ఇద్దరు వేరే పని మీద నగరానికి వెళ్లిపోయారు; అది ముగించుకుని ఇల్లు చేరుతారు వెనక్కు రాకుండా. అప్పలస్వామి రెండున్నరకు వెళ్ళిపోయాడు; ఇంటి పక్కవాళ్ళ కూతురు పెద్ద మనిషయిందట. సురాపానంతో కూడిన ఘనమైన భోజనం ఏర్పాటైంది. భోజనం వగైరా వగైరా వాసనలు వెదజల్లుతూ రావడం బాగుండదు కాబట్టి స్వామి రానన్నడు తిరిగి. పొద్దున్నే వాళ్ళ ముగ్గురికీ అనుమతిని జారీ చేశాడు వేదాంతరావు అందంగా నవ్వుతూ. తన దగ్గిర పని చేసే వాళ్ళతో అతను ఉదారంగా ఉంటాడు. వాళ్లపై ఓ రూపాయి అదనంగా ఒదులుకోడానికి వెనుదీయడు. అధునాతన యాజమాన్య కళలు బాగా అబ్బిన వ్యక్తి. అవతలి వాడి మంచితనం కొనుక్కొనవల్సిన రోజులివి. కొనుక్కున్న మంచితనంతో ఖర్చుపెట్టిన దానికన్నా అధికంగా రాబట్టుకోవచ్చని తెలిసిన వ్యాపారశీలి.

అక్కడి పనులు అంతంతమాత్రంగా అర్థమవుతున్నాయి అనంతానికి. స్వేచ్ఛ లేమితనం, ఎనిమిది గంటలపాటు కట్టిపడసినట్టు ఒకే చోట మగ్గటం కొత్త అనుభవం కాకపోయినా ఆదినుంచీ బాధించే అంశాలే. బతకడానికి నాలుగు రాళ్లు ఆర్జించాలంటే ఎన్నోకోల్పోవాలి. ఎప్పుడు కొలువు ముగుస్తుందా, రెక్కలు కట్టుకుని ఇంట్లో వాలుదామా అన్న

విసుగుతో గడుపుతూ ఒచ్చాడు. మరో పది నిముషాలు ఓపిక పట్టాలి. గత యాభై నిముషాలకన్నా మిగిలిన పది లనిముషాలూ ఎక్కువ భారంగా ఉన్నాయి.

యముడి మహిష వాహనం మెడలో గంటల్లా మోగింది ఫోను. ఎత్తాడు అనంతం.

"ఇంకెవరైనా ఉన్నారా?"

మృదు మధుర స్వరం.

"లేరండీ నేనొక్కడినే."

"అయితే దొరికిపోయావు; ఇల్లు దూరం కూడా! ఈ రోజు ఆలస్యం అవుతుంది నీకు. తప్పదు మరి. నేనొచ్చే దాకా దయ చేసి ఉండు. ముఖ్యమైన పనుంది. ఇప్పుడు కార్ఖానాలో ఉన్నా. ఇక్కడ పని అవంగానే రెక్కలు కట్టుకుని అక్కడ గద్దలా వాల్తాను. అక్కడి పనిని త్వరగా ముగించే ప్రయత్నం చేస్తాలే."

"ఫరవా లేదండీ, మీరు వచ్చే దాకా వేచి ఉంటా. అవసరం తీరటం ముఖ్యం కదా?"

ఎలా అనగలిగాడు అంత కష్టమైన మాటలు? నాకు వీలవదు అన్న మాట పెదవి చివర దాకా వచ్చి, తమాయించుకున్నాడు అది ఉద్యోగానికి ఎసరుగా మారే అవకాశం ఉందన్న భయం వలన. మనసులో కలిగే ఉద్ధృతమైన భావోద్వేగాన్ని అణచుకుని, దానికి వ్యతిరేకమైన భావాన్ని మాటలద్వారా వ్యక్తం చేయడం ఎంత కష్టం! అసలు భావం వ్యక్తమయితే అది దారితీసే పరిణామాలు గుర్తుకొచ్చి అవి అసలు భావాన్ని ఒక కెరటాన్ని అణిచినట్టు నియంత్రిస్తాయి.

తనకు వేళాపాళా వున్నాయిగాని, వేదాంతరావుకు పాపం అవి లేవు; నిరంతరం పని ఒత్తిడితో గడుపుతుండాలి. ఉద్యోగిగా యజమాని ఆదేశాన్ని తు.చ. పాటించడం తన ధర్మం కూడా. నిజానికి ఆదేశిస్తున్నట్టు అతను ఎప్పుడూ మాట్లాడడు. గత ఇద్దరు యజమానులకన్నా భిన్నమైనవాడు. తన ఉద్యోగంపోతే అది కేవలం స్వయంకృతాపరాధంవల్ల జరగ వచ్చు.

మొత్తం మీద అతను ఒచ్చాడు. బట్టతల కారు కప్పుకు తగిలి గాయపడకుండా ఒంగి దిగి భవనంలోకి పరుగెడుతున్నాడు, దూసుకొస్తున్నాడు, ఆంబోతులా రొప్పుతున్నాడు, ఎవరైనా అడ్డొస్తే కుమ్మేట్టున్నాడు.

అనంతం ఎదురు చూసిన క్షణం వచ్చింది. ఇపుడు ఇంటికి వెళ్లిపోవాల్సిన క్షణం గురించీ ఎదురు చూడాలి.

"పద పద," అంటూ గదిలోకి జొరబడ్డాడు, అతను కస్తూరి మృగంలా ఉంటాడు. అతని అడుగులు లయభరితంగా, నాట్యకారుడివిలా ఉంటాయి. కొండలన్నింటిని పిడికిళ్లతో పిండిగా కొట్టగలనన్న ధీమా ఉందిఅతనిలో. ఒంటి మీద ఖరీదైన బట్టలుంటాయి, సుఖాలను ఇచ్చే వాళ్ళను ఆకర్షించ దలచినట్టు; సుఖమిచ్చే ఆ శరీరానికి ఆ నూలుపోగు సమర్పించాద్దా అని అతను ఎవరినో ప్రశ్నిస్తున్నట్టు. అతను సంపన్న జీవితం సాధించడమే కాక ఇతరులకు ఉపాధి కలిగించగలిగిన స్తోమత ఉండటం మెచ్చుకో వలసిన విషయం.

"ఈ రోజు పంపిన టెండరుకు సంబంధించిన కాగితాలు తే."

అవి తీసుకు వెళ్లే సరికి అతను ఒక కవరు చింపుతున్నాడు. అందులోనుంచీ పొద్దున్న పంపిన టెండరును బైటికి లాగుతున్నాడు. అది అతనికి తిరిగి ఎలా చేరింది? ఆ ప్రశ్న వినబడినట్లు తలెత్తి అందంగా నవ్వాడు వేదాంతం.

"ఇది సాధారణ విషయం. పశువులు పాలివ్వాలంటే వాటికి గడ్డి పెట్టి పోషించాలి. వాటికి పెట్టే గడ్డి లంచం కాదు. మనం గడ్డి దాచుకుని పొదుగు మీద చెయ్యేయడం దోపిడీతో సమానమే కాక, దానవత్వం కూడా. ప్రభుత్వ అధికారులకు పిడికెడు గడ్డి పెడితే ప్రజా ప్రభుత్వ పొదుగులనుంచి ముంతెడు పాలు పితుక్కోనిస్తారు. ఇది మాత్రం లంచం. ముంతెడు పాలు వస్తున్నపుడు పిడికెడు గడ్డికి వెనుదీయము. ఎక్కువగా మాట్లాడటం నా తత్వానికి విరుద్ధము. ఉపన్యాసాలిస్తే ఎవరూ వినరు; మనతో అవసరాలు ఉన్న వాళ్ళు మినహా. మనతో అవసరం లేని వారు మర్యాదగురించీ వింటున్నట్టు నటించి, ఒక చెవితో విన్నదాన్ని రెండో చెవిగుండా వదిలేస్తారు. ఎవడికన్నా ఎవడు తెలివి తక్కువ వాడనీ, ఒకరి మాటలు మరొకరు ఆబగా వినడానికి? నిన్ను చూస్తే, నా భావాలు – సాదాసీదావే అయినా – అరమరికలు లేకుండా చెప్పుకో వాలనిపిస్తోంది ఎందుకో. నీకు ఆసక్తి లేకపోయినా. నా గురించి వినే త్యాగం చెయ్యి – మనిద్దరి మధ్యా ఏ అనుబంధం లేకపోయినా, నాకు నీవు ఏ బాకీ లేకపోయినా. వ్యాపారానికి అవసరమైన మేరకే నేను జనంతో సత్సంబంధాలు కలిగి ఉంటాను. సంబంధాలు వేరే, అనుబంధాలు వేరే. మిగతా వాళ్ళతో మామూలు సంబంధాలు ఉంటాయి. సత్సంబంధాలను అనేక విధాలుగా కొనుక్కుంటాను. అలాంటి సత్సంబంధం కారణంగానే అధికారుల దగ్గిర మాత్రమే జాగ్రత్తగా ఉంచ వలసిన ఈ టెండరును నా దగ్గిరకు తెచ్చుకో గలిగాను. లంచం తగినంత ఇవ్వాలేగాని వాళ్ళ ప్రాణాలు తప్ప తమవి కానివి, ప్రభుత్వానికి సంబంధించినవి  ఏవైనా ఇచ్చేస్తారు తగు జాగ్రత్తలు తీసుకుని."

లెక్కల యంత్రం మీద గారడీ చేశాడు. ఆ అంకెలను కాగితం మీదికి ఎక్కించాడు. అతని కదలికలలో ఎంతో వేగముంది, నాట్యమూ ఉంది. కళ్ళకు గంతలు కట్టినా ఇపుడు చేస్తున్న వాటిలో సగం చేయగలడు. అతని శరీరంలో పశుబలం ఉంది. తీర్చమని ఒత్తిడిచేసే కోర్కె ఉంది. చేసే పని మరింత డబ్బు తెస్తున్నదన్న ఆశ, డబ్బు ద్వారా సుఖాన్ని కొనుక్కో వచ్చన్న ఆలోచనా అతన్ని అతి వేగంగానూ, చాకచక్యం తోటి నడుపుతున్నాయి. ఇలాంటప్పుడు అతని అదుపులో అతను ఉండడు. సౌఖ్యమే అతని జీవితార్థం. ఆ క్షణాన్నీ అందిపుచ్చుకోవాలన్న ఆత్రుతతో ఉంటాడు.

"టైపురైటర్ మీద ఈ టెండరు పేపర్లు ఎక్కించి అంకెలను ఈ కాగితం మీద ఉన్న వాటిలా మార్చాలి. ఎట్టి పరిస్థితుల లోనూ ఈ రాత్రికి స్టోర్సు మ్యానేజరు చేతికి వీటిని అందజేయాలి. మన లబ్ధిమాట అటుంచి ఇవి వాడికి చేరడం ఆలస్యమైతే వాడి గుండె ఆగి పోయే ప్రమాదం ఉంది. అవసరం లేకుండా ఎవరి ప్రాణం మాత్రం ఎందుకు తీయాలి? వాడు మనకు సాయం చేయడానికి కొన్ని పరిస్థితులు అనుకూలించాయి; ఉభయాత్రా లాభమూనూ. విరిగిన వ్రేలి మీద ఒంటేలు కూడా పోయరు ఈ లోకంలో; వృథాగా మరుగు దొడ్లోనే రోడ్డు ప్రక్కనే మురికి కాలువలోనో వ్రేలాడేసుకుని పోసేస్తారు గాని. రేపు ఆ మ్యానేజరు నన్ను కలుస్తాడు. ఉంగరాలజుట్టు; దబ్బపండు ఛాయ. సింహంలా నడుస్తాడు. గుండె పిల్లిది, బుర్ర నక్కది   బలహీనమైనది. నాలో బొబ్బిలి పౌరుషం ఉందంటాడు. అతని అందంచూసి నాలాంటి వాడు తట్టుకోలేడు.

కౌగలించుకోవాలి అనిపిస్తుంటుంది. అతని అందానికి మెచ్చుకోలుగా కూడా ఒక రూపాయ అదనంగా ఇస్తుంటాను. చప్పరించి మింగవలసిన అతని అందాన్నొదిలి ఒక అనాకారపు పగిడీవాలాతో అక్రమ సంబంధం ఏర్పర్చుకుంది అతని అందమైన భార్య. జాలిపడి నేను మరో రూపాయి అతనికి అదనంగా ఇస్తుంటాను లంచంతోపాటు. హోటలుకు వస్తాడు మారుతి 800లును నత్త నడక నడిపిస్తూ. కారు దిగి నాలుగు దిక్కులనూ వాటి నాలుగు మూలలను 360 డిగ్రీలూ తలతిప్పి చూస్తాడు. ఈశాన్యం మూల టేబులుపై చేరతాడు. అక్కడికి అతనికి ముందే నేను చేరి ఆ రోజు వార్తా పత్రికలో పదో పరకో ఉంచి టేబుల్ మీద ఉంచుతాను. మడతలోని నోట్లు కింద పడిపోకుండా, దిన పత్రికను శ్రద్ధగా చదువుతున్నట్టు నటిస్తాడు కాసేపు. టిఫిన్ తిందామా అంటాడు; నేను ఒద్దంటాను. నేను టిఫిన్ ఒద్దన్నందుకు రెండు క్షణాలు నొచ్చుకుంటాడు. మా ఇద్దరి కాఫీ ఖర్చూ తానే భరించి, అమాయకంగా ఆ పేపరును చంకలో పెట్టుకుని 800 వైపు అడుగులేస్తాడు. ఎవడన్నా పట్టుకుంటే రామ రామా ఇందులో డబ్బుందని తనకు తెలియదని బుకాయించ వొచ్చు. నోట్లను చేత్తో పెట్టుకోకుండా తీసుకునే జాగ్రత్తన్నమాట. కాఫీ బిల్లు కూడా తానే చెల్లించానని అనవచ్చు. ఇద్దరం కాకతాళీయంగా కలిశాము కానీ మా మధ్య ఎలాంటి లావాదేవీలూ లేవని అనవచ్చు. లంచగొండులంటే నాకు కాస్త గౌరవం కూడా. వాళ్ళు లేక పోతే వ్యాపారాలు ఇబ్బందికరం అయిపోతాయి. మనం బతకాలంటే వాళ్ళను బతికించుకోవాలి. కళంకం అంటని పతివ్రత డబ్బు. ఆ మాటల అర్థం గ్రహించడానికి ప్రయత్నించు. కొందరు పతివ్రతలు తప్పు చేసినా కళంకం అంటదు; తామరాకుకు తడి అంటనట్టు. ధర్మాత్ముడైన భర్త సుదర్శనుడు తన భార్య ఓఘవతితో తన ఇంటికి వచ్చిన అతిథులు ఏమి కోరితే దాన్నిచ్చి సంతృప్తిపరచమన్నాడు. ఒక అతిథి కోరిన విధంగా లైంగిక సుఖాన్నికూడా ఇస్తుండగా భర్త పిలిస్తే ఆ లైంగికకార్యం పూర్తయిన తరువాత వస్తానంటుంది. భర్త సరేనంటాడు. ఆమెకు మచ్చ అంటనట్టేకదా?"

అంతకు ముందున్న అంకెలను చెరిపి కొత్తవి కొట్టాడు. కాగితాలు తీసుకుని వేదాంతం, అతని వెనుక అనంతం వేదాంతం ఏసీ గదిలోకి వెళ్ళారు. చొక్కా పై గుండెలుతీసి కాలరు మెడమీదికి లాగుకున్నాడు ఒదులుగా. పొడవు చేతులు నలగకుండా వాటిని మోచేతుల దాకా లాక్కున్నాడు. బొచ్చుచేతులు; సీతాకొకలా మారకుండా శారీరకంగా వేదాంతం గొంగళిపురుగులా ఉండిపోయినట్టు . అంకెలు సరిగ్గా అమిరాయో లేదో వేదాంతం పరిశీలించాడు. బాగా అమిరి అందుకు సంతోషాన్ని, మెచ్చుకోలును వ్యక్తం చేశాడు. కానుకలా కూర్చో అన్నాడు. దాన్ని స్వీకరిస్తున్నట్టు అనంతం కూర్చున్నాడు. చెమట పట్టిన అనంతం శరీరానికి గది శీతల పూతను గంధంలా పూసింది.

"ఆలస్యమవుతుందని భయమా?"

"లేదండీ."

"నీవుండేదెక్కడా?"

చెప్పాడు.

"అదృష్టవంతుడివి సముద్రానికి దగ్గిరగా ఉన్నావు. అదృష్టాలు అనేకం. మీరూ అదృష్టవంతులే మీ పని ఆటంకం లేకుండా అయిపోయింది ఇంతవరకు అని అనక. మన పని అను. ఇద్దరు కలిసి చేసేది కదా. ఇలా చేయడం బహుశా నీకు ఇష్టం లేక భరిస్తున్నావనిపిస్తోంది. ఇద్దరు కలిసి చేస్తే పాపాన్నయినా, పుణ్యాన్నయినా సగం పంచుకున్నట్టు. పొందే సౌఖ్యానికి కూడా అది వర్తిస్తుంది. ఇష్టంలేకుండా పాల్గొన్నప్పుడు సౌఖ్యాన్నిసగం సగం పంచుకోడానికి వీలవదు. నీవు మీ ఇంటికి వెళ్లలేని పరిస్థితిలో నా గదిలో గడప వచ్చు. అన్ని సౌకర్యాలూ ఉన్నాయి. ఒకళ్ళకొకళ్ళం తోడు. ఎన్నైనా కబుర్లు చెప్పగలను నీకు నిద్ర రాకపోతే. నీకూ నీ వారు లేరు నాకూ నా వారు లేరు."

అనంతంలో అస్పష్టమైన కారణంగా భయం కమ్ముకుంటోంది. ఉన్నట్టుండి చీకటయిపోయింది విద్యుత్తూ పోయి. ఎవరి కుర్చీలో వాళ్ళు కూర్చుండిపోయారు. వేదాంతం తన కుర్చీ వెనక్కు జరిపిన శబ్దం. లేచాడా? ఎందుకో? దీనికన్నా తలా తగిలి బొప్పి కట్టవచ్చు. అనంతాన్ని  ఇలా హింసిస్తున్నందుకు అతను కావాలని వేయని శిక్ష అవుతుంది. అనవసరంగా కలిపించుకుని ఎందుకో మాట్లాడుతున్నాడు. తాగాడా? ఒక యజమాని తాను ఒక ఆత్మీయుడన్నట్టు మాటాడుతున్నమంచిదనాన్ని అనుమానించడం అపచారం.

"కొవ్వొత్తి ఉందా?"

"తెలియదు."

"కొవ్వొత్తి మంట అందమైంది. కొవ్వొత్తీ ఎంతో అందమైంది; సుఖమిస్తుంది;పైగా త్యాగశీలి. జ్ఞానాన్ని దాచుకుని కూడా జ్ఞానిని అని చాటి చెప్పుకోదు. వింతేమిటంటే వెలుతురుని జ్ఞానాన్ని ఇచ్చే కొవ్వొత్తిని నీడ అనే చీడ వెన్నంటి ఉంటుంది. నీకు కొవ్వొత్తి అంటే  ఇష్టమేనా?"

"కొవ్వొత్తి అంటే అనిష్టం లేదు. దాని గురించి గుచ్చి గుచ్చి ఆలోచించాలని అనిపించలేదు."

"అది సౌఖ్యానికి ప్రతీకగా భావించుకో వచ్చు. సౌఖ్యం మానవాళి    బాదాంధకారాన్ని పారదోలగలదు. ప్రతి అంశం గురించీ ఆలోచించాలి ఈ వయసులో. ఆలోచన జ్ఞానానికి దారి తీస్తుంది. జ్ఞానంతో నాకు పని లేదు అనుకుంటే అది వేరే విషయము; అజ్ఞానమే ఆనందం అని కూడా ఎవరో అన్నారు."

వేదాంతం తడుముకుంటూ ఒచ్చాదు టేబుల్ అవతలి నుంచీ ఇవతలికి. అనంతం భుజానికి అతని శరీరం తగిలి అతను అక్కడికి వచ్చాడని తెలిసింది. చప్పుడు చేయకుండా శరీరాన్ని ఒక చోటునుంచి మరొక చోటుకి చేరవేయగలిగిన సామర్థ్యం ఉంది వేదాంతానికి. తన అవసరాలకు అనుగుణంగా విద్యలు నేర్చుంటాడు. శరీరం మీద శరీరంతో ప్రయోగాలు చేసుకుంటాడు. వేదాంతం కిటికీ దాకా వెళ్ళాడు. తెర తొలిగించాడు. గాలికై కిటికీల గాజు తలుపులు బార్లా తెరిచాడు. నీతిలా బయట మిగిలున్న వెలుతురూ, అపరాధ భావంతో వీస్తున్న గాలీ లోపలికొచ్చాయి. గదిలో మనుషుల, వస్తువుల ఆకృతులు తెలుస్తున్నాయి. అతను అతని కుర్చీలో తిరిగి కూర్చున్నాడు. అతని గాలి పీలుస్తూ ఒదులుతుండటం వినిపిస్తున్నాయి అనంతంకు. నేలా, ఆకాశం, నీరు ఆశ్రయించి జీవించే జీవులకు అతీతమైన జీవి ఊపిరి పీల్చి

ఒదులుతున్నట్టున్నది వేదాంతానిది. యజమానిలో చెడును చూడలేని అనంతానికి జుగుప్స కలగలేదు అనంతానికి. అతని ఇందాకటి సువాసనతో ఇప్పటి చెమటి కంపు అనైతికంగా కలిసి వింత వాసన వస్తోంది. విద్యుత్తు ఎప్పుడు వచ్చేట్టు, ఈ రంగస్థలం మీద యవనిక జారేదెప్పుడు. కాలం ఘనీభవించిందా? కరిగి ఎప్పుడు ప్రవహిస్తుంది? కారణం ఏమిటో తెలియకుండా ఈ ఉద్యోగం ఒద్దు అని వికటాట్టహాసం చేయాలని ఉంది. కరాళ నృత్యం చేయాలి అనుంది. ఢమరుకం వాయించాలనుంది. మూడో కన్ను తెరిచి వికృత మన్మథుడిని దగ్ధం చేయాలనుంది. మూడో కన్ను తెరుచుకోకపోతే, గొంతులో విషం దాగుందేమో దాన్ని మింగి పరమపదించాలనుంది.

వేదాంతం సిగరెట్టు వెలిగించాడు.

"సిగరెట్టు కొంత చీకటిని పోగొడుతుంది."

ఆ సిగిరెట్టును చీకటి తాగుతున్నట్టుంది. చీకటి ఇప్పుడు ఊగుతూ తాగుతున్నట్టుంది; తాగుతూ ఊగుతున్నటుంది. దాన్ని అదే ఊపుకుంటూ సౌఖ్యం పొందుతోంది చీకటి. సిగిరెట్టును తగలపెట్టి తాను ఆనందిస్తోంది. సిగిరెట్ నిప్పుపై చీకటి తగలబడటం లేదు.

"వెలుతురులో కన్నా, చీకటిలోనే ప్రపంచం అందంగా నిగూఢంగా తోస్తుంది."

అనంతం తల తిప్పి కిటికీలోనుంచి బైటికి చూశాడు. వేదాంతం చూడగలిగిన అందచందాలు అనంతం చూడలేక పోతున్నాడు. వేదాంతం కళ్ళు ఎరువుగా తీసుకుని చూడాలి. అతను సౌందర్యోపాసకుడు, సౌఖ్యోపాసకుడు. వాడే పెన్సిలు నుంచీ ప్రతి వస్తువూ కళాత్మకంగా ఉండాలి. గదిలోని ప్రతి వస్తువూ అందంతో తొణికిసలాడాలి. వాటి అమరికలో క్రమబద్ధత ఉండాలి. శుభ్రత వెల్లివిరియాలి. రతీమన్మథుల లోహపు విగ్రహం గోడకు కొట్టిన చెక్క మీదుంది. మూలున్న దొడ్డికాళ్ళ ముక్కాలిపీఠ మీద చేతులు లేకపోయినా వయ్యారం వొలక పోసే వీనస్. వికలాంగపు వీనస్సును చూస్తే దయాభావానికి బదులు శృంగారభావం కలుగుతుంద! గోడకు బంధించిన అడోనిస్ విగ్రహం ఒంకార్లుపోతూ కీళ్ల జబ్బుతో తీసుకున్నట్టుంది. కానీ వేదాంత దృష్టి వేరు. వాజులో దూది లాంటి కృత్రిమ పదార్థంతో చేసిన ఎర్రగులాబీల గుత్తి, వాసన వెదజల్లక పోతేనేమి, కంటికి ఇంపుగా ఉంది. ఏ వస్తువూ సెంటి మీటర్ మేర ఉన్నచోటునుంచీ జరగరాదు. పైన కట్టే టై నుంచి, కింద కట్టే లేసు వరకు నూటొక్క జాగ్రత్తలు తీసుకుంటాడు. నడక లయబద్ధంగా ఉంటుంది. మాట్లాడే టప్పుడు – కనుబొమలు, ముక్కు పుటలు, పెదవులు అందంగా కదులుతాయి. నాలుక నల్లికీచు నాలుకలా నాట్యం చేస్తుంది. నాలుగు రకాల నవ్వులు నవ్వగలడు. గొంతు హెచ్చుతగ్గులతో మంద్రంగా మధురంగా మాట్లాడగలదు. పది రోజులపాటు పది రకాల సువాసనలు వెదజల్లగలడు.దుర్వాసన సంగతి చెప్పక్కరలేదు.

ఒకే లాంటి సౌఖ్యం, ఒకే లాంటి పొందూ, ఒకే లాంటి వాసనా రోత కలిగిస్తాయి. గానుగెద్దు శత్రువు. సీతాకోక చిలుక బంధువు. సౌందర్యోపాసన, సుఖోపాసన ఆహ్వానించ దగినవి. నైతికోపాసన అవశ్యం వర్జనీయం.

"రెండు నిముషాల్లో విద్యుత్తు రావచ్చని ఆశిద్దాము. మనందరిలాగే ఆ పనివాళ్ళు అంత చెడ్డ వాళ్ళు కాదు. దీపం ఆర్పేసిన చేత్తోనే వెలిగిస్తారు; వెలిగించిన దానితోనే ఆర్పేస్తారు. కొంచంపనేవుంది. అది అయిపోగానే నీ దారి నీవు తీసుకోవచ్చు. నాకు నెర్వస్ గా ఉంది. కష్టాలకూ, శ్రమలకూ తట్టుగో కలిగే గుణం మనసుకూ శరీరానికి నేర్పాలి. ఓపిక లేకపోతే ధరణిలో ఏ సౌకర్యం సానుకూలపడదు. నీ శరీరాన్నీ, నీ మనసునూ నీవిగా భావించకూడదు జీవితంలో పైకి రావాలంటే; అది ఒక యోగం. అపుడు వాటి పాపం – అలాంటిదంటూ ఉంటె – నీ పాపంగా అనిపించదు. మనసునూ, శరీరాన్నే మినహాయిస్తే ఇక నేను అనేది ఏముంటుంది అని ప్రశ్నించకు. తత్త్వ మీమాంస నా ఒంటికీ మనసుకూ పడదు. నాకు తెలిసిందల్లా ఎలా సుఖ పడాలా అనే."

సొరుగు తీసిన చప్పుడు అయింది. పిస్తోలు తీసి కాల్చేసుకుంటాడా నా శరీరాన్ని నేను నాదిగా భావించడం లేదు అని రుజువు చేసుకోడానికి? జంతువులు చంపుకోడానికి పళ్ళు, గోళ్ళూ, కొమ్ములు సాధనాలు. నర జంతువుకు అలాంటి సామగ్రి అనేకం; తాను సృష్టించుకున్న వాటితో కలుపుకుని. ప్రేమ బీజాలు నాటడం తెలీదు; ద్వేష బీజాలు నాటడం తప్ప. చావు కూడా ఒక సుఖమే అని భావించిన నాడు, అనుభవించ వలసిన సుఖాలు మిగిలుండకపోతే చస్తాడేమో.

వాక్మన్ తగిలించున్నాడు. నిముషం తర్వాత మొహం మొత్తిందేమో తీసేశాడు,

"నీ అందం చూసి నీకు ఉద్యోగం ఇచ్చా, తెలుసా?"

“తెలియదండీ. నా పనివల్ల ఉపయోగముంది గాని నా అందం మీకు ఏ విధంగా పనికొస్తుంది?"

“ఆ విషయం నాకొదిలెయ్యి. నిరాశ దరికి రానీయరాదు జీవితంలో. నిన్నుగమనించాను; నీలో అది గూడు కట్టుకుంది. అది ఒక విషం. ఫాస్ట్ అన్నవాడు నిరాశా నిస్పృహలతో దయ్యానికి ఆత్మను తాకట్టు పెట్టాడట – మానవాతీత శక్తుల గురించి. ఆత్మను సుఖాల గురించి కూడా తేలిగ్గా తాకట్టు పెట్టేసుకుంటాము. ఎన్నో ఒడిదుడుకులకు తట్టుకుని నిలబడినందుకు జీవితం నన్ను సత్కరించింది. ఈ కుర్చీలో ప్రశాంతంగా ఊగే సౌఖ్యం వెనుక ఒక చరిత్ర ఉంది; ఎవరూ కాగితానికి ఎక్కించనిది. అన్ని చరిత్రలూ కాగితానికి నోచుకోవు; చదివే వాడూ ఉండాలి కదా. ప్రతి దాన్నీ అక్రమం అని నీతులు చెప్పుకుంటూ కూర్చుంటే, కూర్చునే ఉండి పోవలసి వస్తుంది, జీవితంలో అంగుళం దూరం ప్రయాణం సాగదు. చిరుగు బట్టలతో ఆరంభమైన నా జీవిత ఆరంభ దినాలలో, నా వెంట ఉన్నది నా శారీరక ఆకర్షణ ఒకటే. నా ఆర్థిక అభివృద్ధికి సౌఖ్యానికి నా శరీరాన్ని నా ఆత్మతో సహా కుదువ పెట్టేశాను; అలా చేసినందుకు నాకు విచారం లేదు. ఆ పని చేసినందుకు విచారం ఉండుంటే ఆ కుదువ సుఖానికి కాక విచారంగురించిపెట్టినట్టవుతుంది. అది నా ఇష్టం. నాకు ఆ స్వేచ్ఛ ఉంది, అది నైతికమా కాదా అన్న మీమాంస నన్ను కట్టిపడెయ్యక పొతే. నేను మరొకరి శరీరాన్నీ ఆత్మనూ కుదువ పెట్ట లేదు. నా సొంత, సహజసిద్ధమైన ఆస్తులను కుదువ పెట్టాను. దేన్నైనా సాధించడానికి ఏ మార్గం తొక్కానా అన్నది కాదు నాకు ముఖ్యం; లక్ష్యం చేరేనా లేదా అన్నదే. ఓటమి అనాథ; గెలుపు ఒందమంది నాథులది. నీతులు వెండి మబ్బులు, కురియనివి. నిధిలో సౌఖ్యం లేకపోతె రాముని సన్నిధిలో నాకు అది దొరుకుంటుందని ఆత్మ వంచనా

రహితంగా నమ్మితే – దాన్నే పొందు; కాదన్నదెవరు? మార్గం కాదు, సౌఖ్యమనే గమ్యం చేరటం ముఖ్యమని ఇంతకు ముందే అన్నాను కదా. అదా, ఇదా? అన్న మీమాంస జీవితంలో నాకు ఎదురవదు. సంశయాత్మికతే పాపం, మరొకటి కాదు అని గీతలో చెప్పారని ఒక స్వామి గడ్డం నిమురుకుంటూ, ఒక పాపాత్ముడ్ని చూసి జాలిపడుతున్నట్టు నన్ను చూస్తూ – నాకు విమానంలో చెప్పాడు. ఎవరు చెప్పినా వినడంలో నష్టం లేదు. జీవిత లక్ష్యం, మార్గం ఎంచుకున్నతర్వాత తలను పక్కకు తిప్పి భుజం మీదినుంచీ వెనక్కు చూడలేదు. అవసరం ఎవరితో ఉందొ వాడి పాదం నాకితే వాడికి పరమానందం అని తెలిసిన మరుక్షణం ఆ పని చెయ్యడానికి ఆలస్యం చేయలేదు. వాడు ఇంకొకడి పాదాలు పరమాన్నంలా నాకి తన పాదాలు మరొకడి చేత నాకించుకుకునే స్థాయికి చేరి ఉంటాడు. వాడికన్నా అప్పుడు మనం తక్కువ స్థాయి వాళ్ళం ఎలా అవుతాము? శరీరంలో అన్ని భాగాలూ సమాన ప్రతిపత్తి కలిగినవే. మెడ పట్టుకుంటే గొప్పా కాళ్ళు పట్టుకుంటే నీచమూ అవ్వదు. పాదాలు తాకడం వలన మనకు పైసా ఖర్చు అవదు; అవతలి వాడి అహం గాలి తీసిన తోలు తిత్తిలా అవుతుంది; మన పని మనకు చేసిపెట్టాలన్న సంకల్పం వాడిలో కలుగుతుంది. కాలు పట్టుకోడానికి బాధపడను గాని అలా పట్టుకున్నా పని అవకపోతే నొచ్చుకుంటాను. నేను ఊరికే ఏ పనీ చేయను, ఈ ఉపన్యాసం ఇవ్వడంతో సహా. సమాజం సక్రమంగా నడిచి సర్వ జనులూ సుఖంగా ఉండాలని సామాజిక, వ్యక్తిగత నీతి నియమాలను ఏర్పరచుకున్నాము; వాటిని పాటించే వాళ్ళు దివిటీలు లేక ఫ్లడ్లైట్లతో వెదికినా దొరకరని, సమాజంలో ఇమడలేను దాని పోకడ భరించలేను అని అనుకుంటే, దండకారణ్యంలో నివాసం ఏర్పరచుకో. సమాజ స్వరూప స్వభావాలు నాకు చిన్న వయసులోనే అవగతమైనాయి తరువాత, నలుగురూ నడిచేది బంగారు బాట అని విదితమైంది. ఆ బాట ఇరుపక్కలా ఉండే చెట్లకు వేసే ఆకులు రూపాయలు; అవి పూచేదీ కాచేది రత్న మాణిక్యాలు..."

"స్వార్థ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అడ్డదార్లు తొక్కే వాళ్ళు సమాజంలో అనేకులు. వాటిని మరుగు పరిచి, వేరే కారణాలు కనిపెట్టి సమాజరీతిని వాటికి అంటకట్టి తమను తాము సమర్థించుకో చూస్తారు. దొంగకు, హంతకుడికి కూడా వాడిదంటూ వాడి తార్కిక వాదన ఉంటుంది," అన్నాడు అనంతం, వేదాంతం ఉవాచకు అడ్డు తగలేకపోతే అంతం ఉండదని; ఉద్యోగానికి చేటు అయినా.

అనంతం అభిప్రాయాలను పట్టించుకో లేదు వేదాంతం. అనంతం కావాలి; అతని అభిప్రాయం కాదు. పిల్లకాకికి ఉండేలు దెబ్బ ఎట్లా ఉంటుందో తెలియదు. ముందుంది మొసళ్ల పండగ. అనంతం ఎలా భావించినా అతనికి ఏమీ అభ్యంతరం లేదు. సత్యం నిగ్గు తేల్చే యత్నం ఇప్పుడేమీ చేయడం లేదు. ప్రస్తుతం అతనికి ఒక లక్ష్యం ఉంది.

ఆనందపు కొత్త దారులే వేదాంతం సమస్య. మానవ జీవితం ఆ విషయంలో సంకుచితంగా తోస్తుంటుంది. అతికొన్ని అనుభవాలూ అనుభూతులు మాత్రమే అది వెలికి తీసి ఇవ్వగలదు. అందుచేత తానే వెదుక్కోవాలి మరిన్ని కావాలాంటే. ఆత్మానందం గురించి ఆలోచించే వారు దాన్ని అన్వేషిస్తారు; దైహిక సుఖం గురించి ఆలోచించేవారు దాన్ని అనేక విధాలా పొందడానికి చూస్తారు.

"ఇంద్రియాలు మనకు జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి; కృతజ్ఞతా సూచికంగా వాటిని మనం సుఖపెట్టాలి."

కుర్చీ చక్రాలు తిరుగుతూ చప్పుళ్ళు చేస్తున్నాయి అశ్లీలంగా. అసహజ స్వభావాన్ని సమర్థించే పక్క వాయిద్యాలలా. మళ్ళీ ఏదో తీస్తున్నాడు సొరుగులో నుంచి, గారడీ వాడిలా, సొరుగు అక్షయ పాత్రలా.

"అనంతూ, ఇది తీసుకో," చెయ్యి చాచి అన్నాడు.

"చెవులపిల్లా, పావురమా?" అనంతం క్రమేపీ వచ్చిన ధైర్యం తెచ్చిన వ్యంగ్యంతో అన్నాడు.

అతను అనంతం చేతిలోకి దూర్చాడు. ఏమిటో తెలీదు. తీసుకుని చేత్తో పట్టుకున్నాడు. మూడంగుళాల పొడవూ అంగుళం వెడల్పూ ఉంది.

"ఏమిటిది?"

"చాకోలెట్. మధుమేహం లేదు కదూ?"

"లేదు కానీ, నాకు తీపి సహించదండీ."

"చేదు సహిస్తుందా; అలవాటు పడ్డట్టున్నావు దానికి. నీకు మధుమేహం వచ్చినా తీపి పదార్థాలు మానేయడంలో ఉన్న ఇబ్బంది ఉండదు; అదృష్ట జీవివి."

అదృష్ట జీవికి వేదాంతం చెప్పిన నిర్వచనాలు చాలా తేలికైనవి; అదృష్టాన్ని, దురదృష్టాన్ని చాలా తేలికపాటి విషయాలు నిర్ధారించేట్లున్నాయి.

"నీవు సంపాదించేది నీ అవసరాలకు సరిపోతుందా?" తెచ్చిపెట్టుకున్న అమాయకతతో అడిగాడు.

"సరిపెట్టుకుంటే సరిపోతుంది; సరిపెట్టుకోలేక పోతే సరిపోదు. అందుకని సరిపెట్టుకుంటున్నా," నిర్లక్ష్యంగా అన్నాడు.

"నీలో ధైర్యం ఉంది. ధైర్యం అవధులు దాటితే విచ్చలవిడితనానికి దారితీస్తుంది. స్వీయ అనుభవంతో చెబుతున్నా."

"ధైర్యాన్నికూడా అదుపులో ఉంచుకోవాలేమో!"

"విచ్చలవిడిగా ఈ జీవితాన్ని అనుభవిద్దామనుకుంటే మాత్రం ఏ అదుపూ అక్కర్లేదు," వేదాంతం అన్నాడు.

వేదాంతం సౌందర్య పోషణకు అనంతం సంపాదించే మొత్తం సరిపోదు.

అనవసర ఎత్తిపొడుపు మాటల రెండవసారి గీత దాటి అన్నానే అనుకున్నాడు అనంతం. ఓపిక చాలాసేపటి క్రితమే నశించింది. అలాంటి మాటాలన్నతర్వాత చాకోలెట్ ఇచ్చేస్తే అవమానించినట్టుంటుందని కొంచం కొరికి కొరికిన ముక్కను వేములా మింగాడు, మిగతాది జేబులోకి జారవిడుస్తూ.

"ఈ నెల నుంచీ ఐదు వందలు పెంచుతున్నా, సరేనా?"

జాలా, బిక్షమా? తన నుంచి అతను కొత్తగా ఆశించేది లేకపోతె అవి ఏమవుతాయి. అలాంటివి అనంతానికి అక్కర్లేదు. ఐదు వందలు తగ్గించమని చెబుదామని అనుకున్నాడు. వేదాంతం గొంతులో చాకోలెట్ అడ్డినట్టుంది. తీయగా

దగ్గాడు. కమ్మగా చప్పరిస్తున్నాడు, పాలూ కోకోలా వాసనతో గదినిని నింపుతూ. శరీరానికి ఎన్ని అవసరాలూ? తిండి, బట్టల నుంచీ స్ప్రే, చాకోలెట్ల వరకు.

దీపాలు వెలిగాయి.

"కాఫీ ఉంటే బాగుండు. అప్పలస్వామి ప్రత్యేకత అతను  అవసరానికి ఎప్పుడూ అందుబాటులో లేక పోవడం. ఆ ప్రత్యేకత గురించి నా ఆస్థానంలో ఆ కళాకారుడిని పోషిస్తున్నా."

అలా అన్నాడుగాని ఈ సందర్భంలో స్వామి తన మార్గానికి అడ్డు లేకుండా పోయి పరోక్షంగా ఉపయోగపడుతున్నాడు.

లేచి కిటికీ దగ్గిరకెళ్ళి, వాటర్ ఫిల్టరు ఒంచి రెండు లోటాల్లోకి నీరు తీసుకుని, ఒకటి అనంతానికి ఇచ్చి మరొకటి తాను తీసుకున్నాడు వేదాంతం. కొంత తాగి కొంత కిటికీలోనుంచి బయటికి ఉమ్మాడు. అటునుంచీ వీచిన గాలి వలన తుంపర  వెనక్కు వచ్చి అనంతం మీద పడింది. "అయ్యయ్యో" అంటూ సెంటు రుమాలు తీసి అనంతం బుగ్గలు తుడవబోయాడు. అనంతం వారించాడు. అనంతం కుర్చీలోనుంచీ లేవబోతుంటే రెండు భుజాల మీదా రెండు చేతులు వేసి కుర్చీలోకి అదిమి ఉంచాడు. స్ప్రే, చమట, చాకోలెట్ వాసనలతో మదం వాసన సంగమించింది.

పంట్లాము జేబులోకి చెయ్యి పోనించి వాలెట్ తీసి నోట్లు లాగి లెక్క పెట్టకుండా "ఇవి ఉంచు" అన్నాడు వేదాంతం తాను ఆశించిన సుఖానికి కట్టని వెలలా.

సమాధానంగా అనంతం కుర్చీలోనించి లేచి పోయి విసవిసా రోడ్డు మీదికి వచ్చి చేరాడు. వెనుక నుంచీ వేదాంతం పదేపదే ప్రాధేయపడుతూ పిలుస్తున్నాడు. నన్ను అపార్థం చేసుకున్నావన్నాడు.

నాలుకకు తీయదనాన్నిచ్చిన చాకోలెట్ ఇంకా వెగటు పుట్టిస్తోంది. జేబులోకి ఎడమ చేతిని పోనిచ్చి అవశేషాన్ని మురికి కాలువలోకి విసిరేసాశాడు. వెళ్ళంగానే బస్సు ఒచ్చింది. ఊళ్లోకి వెళ్ళడానికి అరగంట పైనే పడుతుంది. ఈ లోగా మనసంతా క్రిక్కిరిసిన ఆలోచనలు. అత్యాచారం చేయబడిన భావన.

జీవించడానికి, చావడానికి ధైర్యం కావాలి. జీవించడం మానసికంగాకూడా సాధ్యం కావాలి. నీతి, మరొకటీ అన్న మాటలు కట్టిపెడితే వేదాంతం చర్య ఎందుకు తనను ఇంతలా కలతకు గురిచేసింది? చట్రంలో మనసు బందీ అయింది. నైతికత, అనైతికత విషయం పక్కనుంచితే తన ఇష్టం, అనిష్టం సమస్యగా దాన్ని తీసుకో కలిగి ఉంటె 'ఒద్దు' లేక 'నాకు అలా చేయడం అనిష్టం' అంటే ఆ విషయం అంతమయ్యేది. ఎందుకు అది తనను వెన్నంటి బాధిస్తోంది? తన అసహాయత. తన అసహాయ పరిస్థితిని వాడు వాడుకో చూశాడే అన్న ఆవేదన. వేదాంతం సంకల్పమే తనను బాధించే అంశంగా మారింది. తను నైతికత చట్రాన్ని, ఇష్టానిష్టాల చట్రాన్నీ అధిగ మించగలిగినపుడు, మెరుగైన భౌతిక జీవితాన్ని– ఎవరితోనూ పేచీ పడకుండా, దేనితోనూ పేచీ పడకుండా – జీవించే వీలుంటే ఆ పని చేస్తే పోలా? అది అంత తేలికా?

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS